## ప్రశాంత వాతావరణంలో దేవి నవరాత్రోత్సవాలు జరుపుకోవాలి

### సిపి డా॥అనురాధ

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:**

ప్రశాంతమైన వాతావరణంలో దేవి నవరాత్రోత్సవాలు జరుపుకోవాలని...అమ్మవారిని భక్తి శ్రద్దలతో పూజించాలని సీపీ డాక్టర్ బి.అనురాధ సూచించారు. సోమవారం ఆమె మాట్లాడారు. వర్షాలు పడుతున్నందున మండపాలల్లో ఏర్పాటుచేసే విద్యుత్ దీపాలలో జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. దుర్గామాత ప్రతిష్టకు సంబంధిత పిఎస్‌తోపాటు విద్యుత్ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దన్నారు. దుర్గామాత మండపం వద్ద ముగ్గురు వలంటీర్లు 24 గంటలు కాపలా ఉండాలని సూచించారు. మండపాలవద్ద టపాకాయలు, ఇతర మందుగుండు సామాగ్రిని ఉంచరాదన్నారు. దుర్గామాత విగ్రహాల కమిటీ సభ్యుల పేర్లు,అడ్రస్, సెల్‌నంబర్లు పోలీసుస్టేషన్‌లో ఇవ్వలన్నారు. లౌడ్‌స్పీకర్లు వాడరాదన్నారు. నిర్వాహకులు, ప్రజలు పోలీసుల సలహాలు,సూచనలు పాటిస్తూ ప్రశాంతంగా దుర్గామాత పండుగ నిమజ్జనం జరుపుకొని జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## క్లినిక్‌ను సీజ్ చేసిన డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌ఓ గాయత్రిదేవి

**మనూర్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** బాలుడి మృతికి కారణమైన మండల పరిధిలోని షెల్గిరా గ్రామలోని క్లినిక్‌ను సోమవారం డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌ఓ సంధ్యారాణి సీజ్ చేశారు. ఆర్‌ఎంపి డాక్టర్ చేసిన వైద్యం వికటించి బాలుడు మృతి చెందిన విషయం పాఠకులకు విధితమే. విషయం తెలుసుకున్న డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌ఓ సంధ్యారాణి గ్రామాన్ని సందర్శించి క్లినిక్‌ను తనిఖీ చేసి మృతి చెందిన బాలుడి కుటుంబ సభ్యులతో, గ్రామస్థులో పలు విషయాలను అడిగి తెలుసుకుని క్లినిక్‌ను సీజ్ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకండా క్లినిక్‌ను నడపడం నేరమని సంధ్యారాణి చెప్పారు. సంధ్యారాణి వెంట డాక్టర్ నర్సింగ్ చౌహాన్, ఎస్ఐ కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



క్లినిక్‌కు సీజ్ చేస్తున్న గాయత్రిదేవి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

## బతుకమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

బతుకమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేయాలని, మున్సిపాలిటీలలో బతుకమ్మ హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలన్నారు. బతుకమ్మ ఆడే ప్రాంతాలు, నిమజ్జనం చేసే చెరువులు ఇతర నీటి వనరులవద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు.నిమజ్జనం ప్రాంతాలలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు.మహిళా రచయితలచే బతుకమనఉత్సవాలపై కథనాలు ప్రచురించాలని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం మేళాలను నిర్వహించాలన్నారు. మహిళలచే 5కే రన్, టు కే నిర్వహించాలన్నారు. 30న సద్దుల బతుకమ్మ రోజు కలెక్టరేట్‌లో ప్రభుత్వ ఉద్యోగులచే పెద్ద యెత్తున్న బతుకమ్మ పండుగ నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్, డిఆర్వో నాగరాజమ్మ, వివిధశాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

### సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న గరిమా అగ్రవాల్

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి దోహదపడుతుందని జిల్లా అదనపుకలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు.ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. దరఖాస్తు దారులకు న్యాయం చేసి తిరిగి దరఖాస్తు పెట్టుకోకుండా చూడాలన్నారు. 174 దరఖాస్తులను స్వీకరించినట్లు ఆమె తెలిపారు.కార్యక్రమంలో డిఆర్వో నాగరాజమ్మ, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 22, ప్రభాకర్‌వార్త :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 65 ఫిర్యాదులు అందాయన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ తో పాటు, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ పండుగ ప్రారంభం

### పాల్గొన్న జిల్లా కలెక్టర్, సబ్‌కలెక్టర్, అదనపు కలెక్టర్లు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో బతుకమ్మ పండుగను సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ప్రారంభించారు.మొదటిరోజు ఉత్సవాలను రెవెన్యూ, సర్వే, ల్యాండ్ రికార్డుల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ఉమాహారతి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డిఆర్ఓ పద్మజారాణి, కలెక్టరేట్ విభాగాల మహిళా అధికారులతో కలిసి కలెక్టర్ బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా, ప్రత్యేకంగా నిర్వహిస్తున్న బతుకమ్మ పండుగను గ్రామాలు, పట్టణాలలో మహిళలు ఆనందంగా జరుపుకునే పూల పండుగ అని అన్నారు. కార్యక్రమంలో సర్వే ల్యాండ్ రికార్డ్ అధికారి ఐనెస్ , పిడి ఐసిడిఎస్ లలితకుమారి, రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్ శాఖ, కలెక్టరేట్‌లోని సిబ్బంది పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ ప్రావీణ్య తదితరులు

### విదేశాలలో ఉన్న తెలుగు వారు

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలి

### రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త**

భారతదేశానికి సంబంధించి 100 మంది సీఈవోలుగా ఇతర దేశాలలో ఉన్నారని వారంతా వచ్చి తెలంగాణలో పెట్టుబడులు పెట్టి వారి తెలివి తేటలను దేశ అభివృద్ధికి ఉపయోగించాలని రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. సోమవార ం పట్టణంలోని ఎల్లమ్మ దేవాలయాన్ని కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులతోపాటు సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను అయా శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో అమెరికాతో దౌత్య సంబంధాలలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అమెరికాలో మనవాళ్ల చదవుకోవడానికి, ఉద్యోగాలు చేసుకునేందుకు ఆటంకాలు ఉన్నాయన్నారు. పెట్టుబడి పెట్టాలనుకునే వారికి ఇక్కడి రాష్ట్రాలు రెడ్ కార్పేట్లు వేసి స్వాగతం పలుకుతున్నాయన్నారు. తెలుగు వారు అంతా గ్రామీణ ప్రాంతాలను పారిశ్రామికంగా, సాంకేతికంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.

**సుందరీకరణ పనులు వేగవంతం చేయాలి...**

ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కట్ట అక్కడక్కడ కోతకు గురికాగా వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. జరుగుతున్న పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యత పాటించడంతో పాటు ఎక్కడా ఇబ్బంది రాకుండా చూసుకోవాలని సూచించారు. బతుకమ్మ పనుల



ఎల్లమ్మ చెరువు కట్టను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఏర్పాటు ఘనంగా జరుపుకునేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని, చెరువు నిండుకుండలా ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున చెరువులోపలికి భారికేడ్లు ఏర్పాటు చేయాలని అంతేకాకుండా ఒక స్టేజి, సౌండ్ అనౌన్స్‌మెంట్ సిస్టం, పోలీస్ బందోబస్తులు పండగ రోజు ట్రాఫిక్ అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

**ప్రశాంత వాతావరణంలో పండగ నిర్వహించుకోవాలి...**

తెలంగాణ రాష్ట్ర పండగైన బతుకమ్మ పండగను ప్రజలు ప్రశా ంత వాతావరణంలో జరుపుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బతుకమ్మ ఉత్సవాలు, దేవి నవరాత్రులకు ప్రజలు ఎలంటి ఇబ్బందులు పడకుండా ఉండాలని ముఖ్యమంత్రి రేంవత్ రెడ్డి ఆదేశాల మేరకు పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క సూచనలతో అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లతో పాటూ సౌకర్యాలు పూర్తి చేశారని, ఈ ఏర్పాట్లను జిల్లాల కలెక్టర్‌లు, పంచాయతీ రాజ్ అధికారులు, గ్రామ కార్యదర్శులు సమీక్షిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, ఆర్డీవో రాంమూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, నాయకులు చిత్తారి రవిందర్, వెన్న రాజు, బూరుగు కిష్టస్వామి, అక్కు శ్రీనివాస్, కేశవేణి రమేష్ ఉన్నారు.

# అజ్జమర్రి జోగిపేట బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

### మంత్రి దామోదర రాజనర్సింహా

**జోగిపేట, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :**

ఆర్ అండ్ బి, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి అజ్జమర్రి జోగిపేట బ్రిడ్జి నిర్మాణం పనులు వేగవంతం చేయాలని మంత్రి దామోదర్‌రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సోమవారం బ్రిడ్జినిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. బ్రిడ్జికి అనుసంధానం చేసే అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. భారీవర్షాలకు దెబ్బతిన్న రహదారులకు వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలని చెప్పారు. అజ్జమర్రి జోగిపేట బ్రిడ్జి పూర్తయితే చిలిపిచేడ్ మండలంతో పాటు హత్నూరు, ఆందోల్ మండలాల ప్రజలు జోగిపేటకు రాకపోకలు సాగించడానికి సులువుగా ఉంటుందని సూచించారు. ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని, మత్త క్యాసరమ్, కుసులూరు, గార్లపల్లి రహదారి నిర్మాణం పనుల పురోగతి పై



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదరరాజనర్సింహా.

మంత్రి అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో చేపడుతున్న రోడ్డు నిర్మాణం, విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ ఈ వసంత నాయక్, నర్సింలు, డి ఈ రవీందర్ ఏఈఈ శశాంక్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ఎంగిలి పూల రోజు వెలగని మున్సిపల్ లైట్లు

### చీకట్లోనే బతుకమ్మ వేడుకలు.. మున్సిపల్ అధికారుల తీరుపై ప్రజల మండిపాటు

**చేర్యాల, సెప్టెంబరు 22, ప్రభాతవార్త**

తొలి రోజు మొదలైన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేయడంలో చేర్యాల మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. తెలంగాణ సాంప్రదాయం ప్రకారం తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తుంటారు.ప్రతి ఏడు బతుకమ్మ వేడుకలను రాష్ట్రప్రభుత్వం ఘనంగా నిర్వహించేది. కాని ఈ ఏడాది ఇక్కడి అధికారుల నిర్లక్ష్యం కారణంగా బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకునే విధంగా లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.ఈ వేడుకలకు మున్సిపల్ అధికారులు నామమాత్రంగా ఏర్పాట్లు చేయడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని వీధుల్లో బతుకమ్మ ఆడుకునేందుకు స్థల ఏర్పాటుతోపాటు లైట్లు ఏర్పాటు చేయకపోగా, మరికొన్ని ప్రదేశాల్లో అక్కడక్కడ లైట్లు వెలగకపోవడంతో చీకట్లోనే పండుగను జరుపుకున్నారు. ఈ విషయంపై కొంతమంది సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి కామెంట్ చేయడంతో చర్చనీయాంశంగా మారింది.

జిల్లా కలెక్టర్ చేర్యాల మున్సిపల్ కార్యాలయంపై దృష్టి సారించి ప్రత్యేక చర్యలు చేపట్టే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

**సోంత ఖర్చులతోనే ఏర్పాట్లు చేసుకొంటున్నాం...**

బతుకమ్మ వేడుకలకు చేర్యాల మున్సిపల్ అధికారులు ముందుస్తు ఏర్పాట్లు చేయకపోవడంతో పట్టణంలో సొంత ఖర్చులతో సౌకర్యాలు ఏర్పాటు చేసుకుంటున్నామని ప్రజలు తెలుపుతున్నారు. కొంత మంది కాలని వాసులు మున్సిపల్ అధికారులకు ఇరవై రోజుల క్రితమే సౌకర్యాలు కల్పించాలని దరఖాస్తు చేసుకున్నా ఇటువైపు కన్నెతి చూడలేదన్నారు. దీంతో ఎంగిలిపూల రోజు మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు.

**మున్సిపల్ కమిషనర్ నాగేందర్‌ను వివరణ ...**

టెక్నికల్‌సాంక్షన్ ఈనెల 16న వచ్చిందని మున్సిపాలిటీకి నిధులు రూ.8లక్షలు మంజూరు కాగా టెండర్‌కు ప్రకటన వేయడానికి సమయం పట్టిందని తెలిపారు. కాని ఏదిఏమైనా టెండర్ ఖరారు కాక ముందే ఓ కాంట్రాక్టరును వెంటపెట్టకుని ముందస్తు పనులు చేయించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ టెండర్ లేకుండానే పనులు చేయించినట్లు సమాచారం.

దీంతో మున్సిపాలిటిలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. జిల్లా కలెక్టర్ దృష్టి సారించి మున్సిపాలిటీ నిధులు పక్కదారి పట్టకుండా చూడాలని అలాగే గతంలో జరిగిన టెండర్ల పై విచారణ చేస్తే మరెన్నో భాగోతాలు బయట పడతాయని పలువురు అనుకుంటున్నారు.

# ఒకప్పుడు కరువు ప్రాంతం..నేడు సాగుబడికి అనుకూలం

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**నంగునూర్, సెప్టెంబరు 22,ప్రభాతవార్త :**

ఒకప్పుడు కరువు ప్రాంతం...నేడు పామాయిల్ సాగుబడికి అనుకూలంగా మారిందని మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. మండల పరిధిలోని నర్మేటలో నూతనంగా నిర్మించిన పామాయిల్ ఫ్యాక్టరీలో ట్రయల్ రన్ విజయవంతమైన నేపథ్యంలో ఫ్యాక్టరీని ఆయన సోమవారం ఎమ్మెల్యేలు ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్, ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి పామాయిల్ ఉత్పత్తికి సేకరించిన పంటను పరిశీలించి మాట్లాడారు. సిద్దిపేటలో పామాయిల్ ఫ్యాక్టరీ అనేది ఒక భాగోద్వేగమని రైతుల జీవితాల్లో గుణాత్మకమై మార్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఫ్యాక్టరీ రావడానికి కష్టపడింది చెమట చిందించింది బిఆర్‌ఎస్ పార్టీ...విత్తనం నాటింది బిఆర్‌ఎస్ కానీ ఆ పండ్లను తినడానికి బయలుదేరింది కాంగ్రెస్ అని మండిపడ్డారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులను సిఎం రేవంత్‌రెడ్డి రిబ్బన్ కత్తిరించడానికి కత్తెర జేబులో పెట్టుకొని బయలుదేరిండని ఎద్దేవా చేశారు.ఈ



నర్మెటలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

ప్లాంట్ కల సాకారం అవడం అనేది గొప్ప విజయమని సంతోషం వ్యక్తం చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం వరి సాగులో దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. కెసిఆర్ కలల ప్రాజెక్టు కాళేశ్వరంతోనే ఈ ప్రాంతంలో ఆయిల్‌ఫామ్ సాగు అవుతుందన్నారు. రైతుల జీవితాల్లో వెలుగులు వచ్చాయంటే కారణం కాళేశ్వరమేనని తెలిపారు. ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య, రవీందర్‌రెడ్డి, శ్రీనివాజ్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

## భూసేకరణ వేగవంతం చేయాలి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**సంగారెడ్డి మున్సిపాలిటీ 22, ప్రభాతవార్త :** జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను పూర్తిచేయాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ముఖ్యమంత్రి సూచనలు జారీ చేశారు.దసరా పండుగకు ముందే అన్ని పనులు పూర్తికావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.కోర్టు కేసులు ఉన్న భూములకు సంబంధించిన పూర్తి వివరాలను వెంటనే ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. టైటిల్ సమస్యలు ఉన్న భూముల విషయంలో పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేసి, భూములను సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారి నిర్మాణ పనులు ఆలస్యమవకుండా ప్రతి కేసును అత్యంత ప్రాధాన్యంగా పరిగణించాలని అధికారులకు ఆదేశించారు. జాతీయ రహదారుల నిర్మాణం రాష్ట్ర అభివృద్ధి, రవాణా సౌకర్యాల మెరుగుదలకు కీలకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లోజిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ మాధురి



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మాధురి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 33 దరఖాస్తులు అందాయని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి వివరించారు.ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి, డిఆర్ఓ పద్మజారాణి కలిసి అర్జీదారుల నుండి నేరుగా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

### సాంస్కృతిక సారధి కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన

**చేర్యాల, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. సోమవారం మండలంలోని గుర్జకుంట గ్రామంలో విష జ్వరాలపై అప్ర మత్తంగా ఉండాలని కళాప్రదన్శన నిర్వహించారు.ఈ సందర్భంగా సారధి కవి గాయకుడు పిన్నింటి రత్నం కళాకారుల టీం లీడర్ పిల్లిట్ల శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత ప్రతి ఒక్కరు పాటించాలని తెలిపారు.ఈగలు దోమలు ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్ చల్లాలని ప్రతి ఇంట్లో నీటి నిల్వలు ఉంచకుండా డ్రైడేగా పాటించాలని సూచించారు.అలాగే యువత గంజాయి,మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ మహవ్మారిని తరమాలని పాటల,మాటలతో ప్రజ లను చైతన్య పరిచారు.ఈ కార్యక్రమంలో సారధి కళాకారులు సనువాల కనకయ్య,గెంటే హరిప్రసాద్,పన్నీరు శ్రీనివాస్,తండా బిక్షపతి,ఎల్లా సిద్దులు,రాచపల్లి శైలజ తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

**నిజాంపేట్, సెప్టెంబరు 22 ప్రభాతవార్త:** మండలపరిధిలోని నగదర్ గ్రామానికి చెందిన జడ్‌పిహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు చిమ్ములు శ్రీనివాస్ రెడ్డి సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో నాగదర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్నేహితులు శ్రేయోభిలాషులు విద్యార్థులు ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని కోరారు. ఆయన అంత్యక్రియలు 23వ తేదీ మంగళవారం స్వగ్రామంలో నాగదర్‌లో నిర్వహించడం జరుగుతుందని కుటుంబసభ్యులు తెలిపారు.

## డ్రైవర్‌కు 3 నెలల జైలుశిక్ష

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** 2018లో రోడ్డు ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌కు 3 నెలల సాధారణ జైలు శిక్ష, 3500 రూపాయల జరిమాన విధిస్తూ ప్రత్యేక మొబైల్ కోర్టు న్యాయమూర్తి టి దుర్గారాణి కలిదిండి తీర్పు వెలువరించినట్లు కొండాపూర్ సిహెచ్‌ఓ కె సోమేశ్వరి తెలిపారు. సిహెచ్‌ఓ సోమేశ్వరి కథనం ప్రకారం... కొండాపూర్ మండలం గుంతపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ తెనుగు మల్లేశం రోడ్డు ప్రమాదానికి కారణం కాగా నాడు కేసు నమోదు చేశారన్నారు. కేసు పూర్వాపరాలను ఎపిపి టి.లతీఫ ఉర్ రహమాన్ వివరించగా న్యాయమూర్తి టి.దుర్గారాణి కలిదిండి కేసును పరిశీలించి నిందితుడు మల్లేశంకు 3 నెలల సాధారణ జైలు శిక్షతో పాటు 3500 రూపాయల జరిమాన విధిస్తూ తీర్పు చెప్పారన్నారు. జరిమాన చెల్లించకుంటే అదనంగా మరో 15 రోజులు జైలుశిక్షను అనుభవించాల్సి ఉంటుందని న్యాయమూర్తి తీర్పు చెప్పారని వివరించారు.

## అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

**నర్సాపూర్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** అప్పుల బాధతో ఒక యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సాపూర్ మండలం తుజాల్పూర్ గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ లింగం కథనం ప్రకారం... మండల పరిధిలోని సుజాపూర్ గ్రామానికి చెందిన గాలి శివప్రసాద్(22) డీజే బాక్స్ వ్యాపారం చేస్తుండేవాడన్నారు. డీజే బాక్స్ వ్యాపారం చేయడానికి మూడు లక్షల 15 వేలరూపాయలు అప్పుగా తెచ్చాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక తండ్రి గాలి రమేష్ వద్ద బాధపడేవాడని తెలిపారు. అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్థాపం చెంది 21వ తేదీ ఆదివారం సాయంత్రం పొలం వద్ద గల కోళ్ల ఫారానికి వెళ్లి వస్తానని తండ్రితో చెప్పి వెళ్లాడని తెలిపారు. 8 గంటల సమయం వరకు ఇంటికి రాకపోవడంతో తండ్రి గాలి రమేష్ వెళ్లాడు. అప్పటికే శివప్రసాద్ కోళ్ల ఫారంలో రేకుల షెడ్డు పైపుకు తాడుతో ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. వెంటనే గాలి రమేష్ బంధువులతో కలిసి శివప్రసాద్‌ను నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చాడు. అప్పటికే అతడు మృతి చెందాడు. గాలి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి లింగం తెలిపారు.




అరెస్ట్ అయిన గిరిజన నాయకులు

## అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

### ఎస్టి మోర్చ జిల్లా మాజీ అధ్యక్షుడు మోహన్‌నాయక్

**అక్కన్నపేట, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** అక్రమ అరెస్టులతో రాష్ట్ర ప్రభుత్వం గిరిజను(లంబాడి)ల ఉద్యమాన్ని ఆపలేరని ఎస్టీ మోర్చ సిద్దిపేట జిల్లా మాజీ అధ్యక్షుడు నునావత్ మోహన్‌నాయక్ అన్నారు. సోమవారం గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గిరిజన హక్కు సాధనకు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి వెళ్లకుండా ప్రభుత్వం గిరిజన నాయకులను అరెస్టుచేసి తమ హక్కులను కాలరాయాలని చూస్తుందని మండిపడ్డారు. అక్రమఅరెస్టులతో గిరిజనుల ఉద్యమాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. తమ హక్కులు సాధించుకునే వరకు విశ్రమించేది లేదని అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు కృష్ణనాయక్, రైనానాయక్ తదితరులు ఉన్నారు.

## సెలవుల్లో తరగతులు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలి

### ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంసాని రాకేష్




మాట్లాడుతున్న రాకేష్

**హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** దసరా సెలవులలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలలో తరగతులు నిర్వహించకుండా విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంసాని రాకేష్ డిమాండ్‌చేశారు. సోమవారం పట్టణంలో సంఘం నాయకులతో కలిసి మాట్లాడారు. విద్యార్థుల మానసిక వృద్ధి నిమిత్తం ప్రభుత్వం విద్యా క్యాలండర్ తయారుచేస్తుందని, క్యాలెండర్‌ను ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు పట్టించుకోక విద్యార్థులకు ప్రభుత్వం సెలవులు ప్రకటించినా తరగతులు నిర్వహిస్తుంటాయని ఈసారి అలా జరగకుండా చర్యలు తీసుకోవడంతో పాటు సెలవులలో తరగతులు నిర్వహిస్తే ఆ విద్యా సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట హాస్టల్స్ కన్వీనర్ రాజేష్, నగర కార్యదర్శి చరణ్, సంతోష్ ఉన్నారు.

## బతుకమ్మ ఆడేందుకు ఏర్పాట్లు



చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్ తిరుమల్‌రెడ్డి

**మర్కుక్, సెప్టెంబరు 22 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలో బతుకమ్మ చెరువు వద్ద బతుకమ్మ ఆడేందుకు సోమవారం మాజీ సర్పంచ్ తిరుమల్‌రెడ్డి జెసిబి యంత్రంతో పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించి చదును చేపించారు. ఈ సందర్భంగా తిరుమల్‌రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామంలోని ప్రజలు, మహిళలు గ్రామ చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేయడానికి వస్తారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అలాగే వీధి లైట్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కనకయ్యగౌడ్, కొండపోచమ్మ డైరెక్టర్ కిషన్, స్థానిక మాజీ ఉపసర్పంచ్ పద్మ నర్సింలు, గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు



ఈత వనంలో ఈత చెట్టుకు పూజలు చేస్తున్న గౌడ సంఘం సభ్యులు

**గజ్వేల్ టౌన్, సెప్టెంబరు 22 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలోని శ్రీరేణుకా ఎల్లమ్మ దేవాలయంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం కులస్తులు మాట్లాడుతూ ఈత వనంలో ఈదులు గీసుకోవడానికి ఆలయంలో పూజలు చేసి ముహూర్తం చేయడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం దసరాకు నూతనంగా కల్లు దుకాణం తెరువడం జరుగుతుందని, ఇందులో భాగంగా పూజలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం కమిటీ సభ్యులు కొత్తపల్లి ఎల్లాగౌడ్, మాసన్‌పల్లి రాములుగౌడ్, సత్తయ్యగౌడ్, నర్సింలుగౌడ్, ఆశయ్యగౌడ్, పాల నర్సింలుగౌడ్, సిలివేరి స్వామిగౌడ్, మామిడి స్వామిగౌడ్, స్వామిగౌడ్, వెంకట్‌గౌడ్, పోచయ్యగౌడ్, రమేష్‌గౌడ్, బాల్‌రాజుగౌడ్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా ఇసిసిఇ డే




మాట్లాడుతున్న సిడిపిఓ సరిత

**గజ్వేల్ టౌన్, సెప్టెంబరు 22 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం పిడిచెడ్ గ్రామంలోని మూడవ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్(ఇసిసిఇ) డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిడిపిఓ సరిత, సూపర్‌వైజర్ భవానిలు హాజరై మాట్లాడుతూ పిల్లలకు ఏమి కావాలి, తల్లులకు ఏమి కావాలి, ఎలాంటి ఆటలు నేర్పాలి అనే వాటి గురించి తెలియజేశారు. ప్రీ స్కూల్ ఆక్టివిటీస్ గురించి, బాలింతలు, గర్భిణీలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ వి.పద్మ, హెల్పర్ బి.పద్మ, చిన్నారులు, తల్లులు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

# జగన్‌మాతను పూజిస్తే ఆధ్యాత్మిక జ్ఞానం సిద్ధిస్తుంది

### శ్రీ క్షేత్రం పీఠాధిపతి మధుసూదనానంద స్వామీజీ



విద్యాధరి క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి

**వర్గల్, సెప్టెంబరు 22 (ప్రభాతవార్త):** నవరాత్రి మహోత్సవ పర్వదినాలలో జగన్మాత ప్రతిరూపాలైన శ్రీసరస్వతి, శ్రీదుర్గాదేవి, శ్రీలక్ష్మీ దేవిలను భక్తిశ్రద్ధలతో అర్చిస్తే ఆధ్యాత్మిక జ్ఞానం సిద్ధిస్తుందని శ్రీక్షేత్రం పీఠాధిపతి శ్రీ మధుసూదనానంద సరస్వతి స్వామీజీ పేర్కొన్నారు. ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో నవరాత్ర మహోత్సవ అంకురార్పణ కార్యక్రమంలో పాల్గొన్న స్వామీజీ భక్తులకు ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. బాలాత్రిపురసుందరీదేవి అవతారంలో శ్రీ విద్యాధరి అమ్మవారు భక్తులకు దర్శన భాగ్యం కల్పించగా, స్వామీజీ క్షేత్రంలో ప్రత్యేకపూజలు నిర్వహించి భక్తులకు ఆశీస్సులు అందజేశారు. క్షేత్రం వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి ఆధ్యాత్మిక ప్రయాణంలో గొప్పగొప్ప పనులకు శ్రీకారం చుట్టగా, ప్రస్తుతం పరిమళాలు ప్రతి ఒక్కరిలో దైవచింతన పెంపొందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా నవరాత్ర మహోత్సవ పర్వదినాలు ఆధ్యాత్మిక సాధకులకే కాకుండా లౌకిక జీవితాన్ని గడిపే ప్రతి ఒక్కరికి చక్కటి సందేశం ఇస్తుందని అన్నారు. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించమని శ్రీసరస్వతి మాతను, శాంతి, శ్రేయస్సు కోసం శ్రీలక్ష్మీదేవిని ప్రార్థించాలని, అడ్డంకులు తొలగడానికి శ్రీదుర్గామాతను సేవించాలని ఆకాంక్షించారు. శుభప్రదమైన ఈ పర్వదినాల్లో పుణ్యస్థలాలు దర్శించి దేవి దేవతలను అర్చించాలని, తద్వారా ఆధ్యాత్మిక భావన, మానసిక ప్రశాంతత దక్కుతుందని స్పష్టం చేశారు. కాగా మొదటగా క్షేత్రంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఆస్థాన వేద పండితులు బాల ఉమామహేశ్వరశర్మ పరివారం అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, శ్రీగణపతి పూజ, కలశస్థాపన, అంకురార్పణ, చండీ హోమం, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రానికి విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు.



మాట్లాడుతున్న టిపిసిసి కార్యదర్శి దేవులపల్లి యాదగిరి

## రైతుల ఫ్యాక్టరీలో హరీష్‌రావు రాజకీయం చేయడం సిగ్గుచేటు : దేవులపల్లి యాదగిరి

**నంగునూర్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** రైతుల ఫ్యాక్టరీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు రాజకీయం చేయడం సిగ్గుచేటని టిపిసిసి కార్యదర్శి దేవులపల్లి యాదగిరి మండిపడ్డారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తప్పెట శంకర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. సిఎం రేవంత్ రెడ్డి జిల్లా రైతుల అభివృద్ధి కోసం మూడు వందల కోట్ల పై చిలుకు నిధులు మంజూరు చేశారని తెలిపారు. గత కాంగ్రెస్ పథకాల పేర్లు మార్చి లక్షల కోట్లు దోచుకున్న వారు ప్రజా ప్రభుత్వాన్ని నిందించడం విడ్డూరంగా ఉందన్నారు. పదేళ్ల అధికారంలోఉన్న హరీష్‌రావు ఫ్యాక్టరీ భూములలో ఐదుసార్లు శిలాఫలకాలు పాతారే తప్ప పనులు పూర్తిచేయలేదన్నారు. రైతుల సంక్షేమానికి నిర్మించిన ఆయిల్‌ఫాం ఫ్యాక్టరీలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం లాగా అరుపులు, కేకలు సమావేశాలు నిర్వహించడం ఆయన దివాళాకోరుతనం అన్నారు. అది పామాయిల్ ఫ్యాక్టరీయా...బిఆర్ఎస్ కార్యాలయమని ప్రశ్నించారు. మరో సారి రైతుల కోసం నిర్మించిన ఫామాయిల్ ఫ్యాక్టరీలో చిల్లర రాజకీయాలు చేస్తే తరిమి కొడతామని మరో సారి అడుగు కూడా పెట్టానియమని హెచ్చరించారు.సమావేశంలో కాటం కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవయే లక్ష్యం : వంగ రాజేశ్వర్‌రెడ్డి

**చిన్నకోడూరు, సెప్టెంబరు 22,ప్రభాతవార్త :** ప్రజాసేవయే లక్ష్యమని పారిశ్రామికవేత్త వంగ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు.చిన్నకోడూరు, రామునిపట్ల గ్రామాల్లో ఆయన పర్యటించి ఇటీవల మరణించిన బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కష్టం వస్తే అండగా ఉంటానని తెలిపారు.చిన్నకోడూరులో గుడిసె సుశీల, తోట అంజనేయులు, రామునిపట్లలో కొయ్యడ ఎల్లయ్యలు ఇటీవల మరణించడంతో బాధితులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం చిన్నకోడూరు మండల కేంద్రంలోని ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం, మర్రిచెట్టు యూత్ సభ్యుల ఆధ్వర్యంలో రాజేశ్వర్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. చిన్నకోడూరులో ఎంగిలి పూల బతుకమ్మ ఉత్సవాలలో ఆయన పాల్గొన్నారు. ఆయన వెంట బిఆర్ఎస్ నాయకులు కుంబాల చంద్రశేఖర్, పడిగె లింగం ముదిరాజ్, తడ్కమడ్ల శ్రీకాంత్, రెడ్డి సంఘం అధ్యక్షులు కన్నారెడ్డి, డ్రైవర్ల యూనియన్ అధ్యక్షులు కుండె తిరుపతి, పోశినాథం, గొట్టిపర్తి రాజుగౌడ్, రాజలింగం, యువకులు పాల్గొన్నారు.

## ఎమ్మార్‌ై స్కానింగ్ మిషన్ ఏర్పాటు చేయాలి

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** సంగారెడ్డిలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మార్‌ై స్కానింగ్ మిషన్ ఏర్పాటు చేయాలి కోరుతూ సోమవారం ప్రభుత్వాసుపత్రి ముందు సంతకాల సేకరణ కార్యక్రమం ఎమ్మార్‌ై సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్‌ై సాధన సమితి జిల్లా కన్వీనర్ ఎం ఏ రెహమాన్, కో కన్వీనర్లు ఎల్ వేణుగోపాల్, మహబూబ్ ఖాన్, జి మల్లయ్య, వెంకటరాజ్యం ఆర్ లక్షి ్మ, పోతురాజు పవన్, కాశీనాథ, రవి తదితరులు పాల్గొన్నారు.




సంతకాలు సేకరిస్తున్న నాయకులు



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న కాలనీవాసులు

## కాలనీలో వైన్స్ వద్దు.. ప్రజావాణిలో ఫిర్యాదు

**సంగారెడ్డి మున్సిపాలిటీ సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** పట్టణంలోని 37వ వార్డు వీరభద్రనగర్ కాలనీలో ఉన్న వైన్స్‌ను ఇతర చోటుకు మార్చాలని కాలనీవాసులు సోమవారం ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ మాధురికి వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వారు ఫిర్యాదులు పేర్కొన్నారు. మహిళలకు స్థానికులకు ఇబ్బందిగా మారిందని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ అనంతరావు కులకర్ణి, వీరన్న, ప్రసాది రవిశంకర్, మనోహర్, పి.ఎస్.కుమార్, ప్రభాకర్, నాగరాజ్, సంతోష్, శ్రీనివాస్, జనార్ధన్‌గౌడ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**రోడ్లపై గుంతలను పూడ్చాలి...**

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** వర్షాలతో గుంతలమయంగా మారిన రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు సురేష్ జిల్లా అదనపు కలెక్టర్ మాధురికి వినతిపత్రం అందజేశారు. సోమవారం జరిగిన నిర్వహించిన ప్రజావాణిలో వినతి పత్రాన్ని అందజేశారు అందజేశారు. విధులలో నిరక్ష ్యంగా వ్యవహరిస్తున్న ఆర్ అండ్ బి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు జిల్లా నాయకులు శ్రీకాంత్. అనిల్. సిద్దు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు విస్తరణకు భూములిచ్చాం

## సాగుకు పాత రోడ్డు స్థలాన్ని ఇవ్వండి

### ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన అప్పాజీపల్లి వాసులు

**కొల్చారం, సెప్టెంబరు 22(ప్రభాతవార్త):** మెదక్ నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు వేసిన 765 జాతీయ రహదారి నిర్మాణానికి సొంత పట్టభూములు కోల్పోయామని, దీనికిగాను పాత రోడ్డు భూమిని కేటాయిస్తే సాగుచేసుకొని జీవనం గడుపుతామని మెదక్ జిల్లా కలెక్టర్‌కు సోమవారం ప్రజావాణిలో అప్పాజీపల్లి భాదితులు ఫిర్యాదు చేస్తూ వినతిపత్రం అందజేశారు. మా పట్టా భూమిని రోడ్డు విస్తరణలో భాగంగా ఇచ్చినందుకు పాత రోడ్డును మాకు వ్యవసాయం చేసుకోవటానికి గతంలో ప్రభుత్వ అధికారులు హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అప్పాజిపల్లి గ్రామస్థులం సొంత పట్టా వ్యవసాయ భూమి కొల్చారం గ్రామ శివారులోగల సర్వే నెం. 908, 901, 906,905, 904 లలోని పట్టా భూమిని రోడ్డు విస్తరణలో భాగంగా ప్రభుత్వానికి ఇచ్చాం. భూమిని మేం రోడ్డుకు ఇచ్చిన సమయంలో గత ప్రభుత్వ ఎమ్మెల్యే మధన్ రెడ్డి, జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ నర్సాపూర్, కొల్చారం తహసీల్దార్‌లు వచ్చి మేము ఇచ్చిన భూమికి బదులుగా పాత రోడ్డులోగల భూమి ఇవ్వటానికి ఒప్పుకొని అధికారులు హామీ ఇవ్వడం జరిగింది. అధికారుల హామీ మేరకు ఈ భూమిని మేం సాగుచేసుకుంటున్నాం. సెప్టెంబర్ 2, 2025న కొల్చారం తహసిల్దార్ కార్యాలయానికి చెందిన కొందరు అధికారులు వచ్చి ఇది ప్రభుత్వ భూమి అని ఖడీలు పాతడానికి ప్రయత్నించారు. తమరితో మరోసారి విజ్ఞప్తి చేయడమేమనగా మాకు గతంలో నాయకులు, అధికారులు ఇచ్చిన హామీ మేరకు భూమిని సాగుచేసుకోవటానికి అధికారులకు ఆదేశాలు జారీచేసి న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. ఫిర్యాదు చేసినవారిలో మాజీ సర్పంచ్ సునీతావెంకట్‌గౌడ్, రామాంజం, నర్సింలు, యాదయ్య, పోచయ్య వున్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న అప్పాజిపల్లి గ్రామస్థులు



శ్రీ అన్నపూర్ణ విశ్వేశ్వరాలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

## శ్రీసంతోషిమాత దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు

**గజ్వేల్ టౌన్, సెప్టెంబరు 22 (ప్రభాతవార్త):** పట్టణంలోని జగన్మాత శ్రీ సంతోషిమాత దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఉత్సవాల తొలిరోజు అమ్మవారు బాలాత్రిపురసుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు రాజశేఖరశర్మ సిద్ధాంతి మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యాసరస్వతి, కృష్ణమాచార్య మాధవానంద సరస్వతి, చంద్రశేఖరశర్మ సిద్ధాంతి ఆశీస్సులతో ప్రతిరోజు పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. నవరాత్రోత్సవాల్లో భాగంగా దాతల సహకారంతో ప్రతిరోజు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుందని, తొలిరోజు ఊడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే సాయంత్రం వేళల్లో భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయని అన్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం అని తెలిపారు.

**శ్రీఅన్నపూర్ణ విశ్వేశ్వరాలయంలో...**

గజ్వేల్ పట్టణంలోని శ్రీఅన్నపూర్ణ విశ్వేశ్వరాలయంలో సోమవారం జగ్గయ్యగారి శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో పురోహితుడు నిరంజన్‌శర్మ సౌజన్యంతో దుర్గామాతకు శ్రీచక్రం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గయ్యాగారి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు హాజరయ్యే భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు మహా ప్రసాదం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల రమేష్, సురేందర్, అమర నాగేందర్, నేతి శ్రీనివాస్, నేతి సత్యనారాయణ, మహిళలు పాల్గొన్నారు.

## రైతులు పంటను నమోదు చేసుకోవాలి : ఎవో

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** రైతులు సాగు చేసుకున్న ప్రతీ పంటను కచ్చితంగా నమోదు చేసుకోవాలని హుస్నాబాద్ మండల వ్యవసాయశాఖ అధికారి వేల్పుల పూజ అన్నారు. సోమవారం రోజున మండలంలోని గాంధీనగర్‌లో డిజిటల్ క్రాప్ సర్వే ద్వార చేస్తున్న పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని రైతులు సాగుచేస్తున్న పంటలను తమ వ్యవసాయ విస్తరణ అధికారులకు చెప్పి నమోదు చేపించుకోవాలన్నారు. పంట నమోదు చేసుకోకుంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో పంటలు అమ్ముకోలేరని, తద్వార వారికి మద్దతు ధర లభించక నష్టపోతారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సంగీతతె పాటు తదితరులు ఉన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరం

**జగదేవ్‌పూర్, సెప్టెంబరు 22 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని తీగుల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారని పిహెచ్‌సి వైద్యాధికారి రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య శిబిరంలో పిల్లలకు, మహిళలకు, చర్మ వ్యాధిగ్రస్తులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించామని, అదేవిధంగా కంటికి సంబంధించిన పరీక్షలు, చెవి, ముక్కు, గొంతు, పళ్ల, మానసిక సంబంధిత వైద్య పరీక్షలతోపాటు సాధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు హిమబిందు, మహేష్, శ్వేతా రెడ్డి, రాకేష్, కళ్యాణ్, హారిక, సంధ్య, తిరుపతిరెడ్డి, స్టాలిన్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బతుకమ్మ పాటల పుస్తకాల పంపిణీ

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** అలియాన్స్ జిల్లా గవర్నర్ గందె ఈశ్వర్‌చరణ్ లక్కిరెడ్డి విజయ శుభాకర్‌రెడ్డి రచించిన తెలంగాణ సాంప్రదాయ బతుకమ్మ పండుగ పుస్తకంను మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ సభ్యులు ఆత్మరాములు, వనజ, పిఆర్ఓ రేణుక,మంజుమాత క్లబ్ ప్రెసిడెంట్ చంద్రకళ, మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

**నంగునూర్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** బతుకమ్మ సంబరాల్లో భాగంగా సోమవారం నంగునూర్ ఐకెపికార్యాలయంలో సిబ్బంది, మండల పరిధిలోని ఆయా గ్రామాల గ్రామ సంఘాల ప్రతినిధులు, వివోఏలు, మండల సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బతుకమ్మ సంబరాల్లో పాల్గొని తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎపిఎం శ్రీనివాస్,సీసీలు శ్రీనివాస్, లింగం, ప్రేమలత, మల్లేశం, సిబ్బంది బాలరాజు,ముజామిల్, సరోజన, వివోఏలు పాల్గొన్నారు.

## కామ్రేడ్ వజీర్ బేగ్ సేవలు మరువలేనివి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, సెప్టెంబరు 22 ప్రభాతవార్త :** నమ్మిన సిద్ధాంతానికి పాటుపడిన వ్యక్తి కామ్రేడ్ పన్యాల వజీర్ బేగ్ అని పలు సంఘాలు, పార్టీల నాయకులు పేర్కొన్నారు. ఆయన ప్రథమ వర్ధంతిని సోమవారం సంగారెడ్డిలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి. మహబూబ్‌ఖాన్, డిసిసి సెక్రెటరీ ఎండి. తాహెర్‌పాషా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎంఏ రెహమాన్, టిఆర్ఎస్ నాయకులు పరశురాంనాయక్ బిఎస్‌పి నాయకులు మల్లయ్య బాబు, జగ్జీవన్‌రావ్ సమతా సైనిక్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఎల్ వేణుగోపాల్ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వెంకటరాజ్యం మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ లక్ష్మి నాయకులు పోతురాజు పవన్ శివశంకర్ రాజు రవి కాశీనాథ్ వజీర్ బేగ్ తనయుడు బాబా తదితరులు పాల్గొన్నారు.




వజీర్‌బేగ్‌కు నివాళులర్పిస్తున్న వివిధ పార్టీల నాయకులు

### స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల రూపకల్పనలో

# అధికార యంత్రాంగం నిమగ్నం

**సంగారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** స్థానిక సంస్థలకు ఎన్నికలకు వడివడిగా అడుగులు ముందుకు పడుతున్నాయి. ఇప్పటికే ఓటర్ లిస్టులో వార్డుల వారిగా ఓటర్లా బితాలు తయారు చేయడంతో పాటు, ఓటర్ లిస్టులో కులాలవారీగా గణన కూడా పూర్తి అయింది. దీనితో పాటు రిజర్వేషన్లకు సంబంధించిన కీలకమైన అంశం కూడా తుది ఘట్టానికి చేరుకొంది. దీనికి సంగారెడ్డి జిల్లా పరిధిలోని 613 గ్రామపంచాయతీలు వాటి పరిధిలోని ఎంపీటీసీ జడ్పిటిసిలు వార్డు సభ్యులకు సంబంధించిన రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ సోమవారంనాడు సంబంధిత జిల్లా యంత్రాంగం చేపట్టింది. సంగారెడ్డి జిల్లా పరిషత్ లోని సమావేశ మందిరంలో సంగారెడ్డి జిల్లా పరిధిలోని ఎంపీడీవోలకు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జడ్పి సీఈవో జానకి రెడ్డి,, డి పి ఓ సాయి బాబాలు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం రూపొందించిన ఫార్మాట్లో వాటిని పూర్తి చేయడానికి అవసరమైన సూచనలు సలహాలను ఇచ్చారు. ఉదయం ప్రారంభమైన ఈ సమావేశం సోమవారం రాత్రి వరకు కొనసాగింది. ఈ సమావేశంలో జిల్లాలోని ఆయా మండలాల పరిధిలోని వార్డు సభ్యులు గ్రామపంచాయతీ సర్పంచులు ఎంపిటీసీలు జడ్పీటీసీలు ఎంపీపీ లకు సంబంధించిన రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను చేపట్టారు. ప్రభు ప్రభుత్వం రూపొందించిన ఫార్మాట్ ప్రకారం గత లో జరిగిన ఎన్నికలలో ఏ స్థానం ఎవరికి రిజర్వేషన్ అయింది పరిశీలించడంతోపాటు, ప్రస్తుతం అందుకు పాటులో ఉన్న జనాభా ప్రాతిపదికన ప్రస్తుతం ఎవరికీ ఏ వర్గానికి ఏ గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎంపిటిసి, జెడ్పి టి సి,, ఎం పి పి, వార్డు సభ్యుల రిజర్వేషన్ వర్తిస్తుందో అనే విషయాన్ని ఫార్మాట్ రూపంలో రూపొందించారు. ఇందులో ప్రభుత్వం రెండు విధాలుగా ఫార్మాట్లను ఇచ్చి పూర్తి చేయించినట్లు తెలిసింది. ప్రభుత్వం ఎప్పుడు అడిగినా రిజర్వేషన్లను అందించడానికి నివేదికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. రిజర్వేషన్ల ప్రక్రియను చేపట్టడానికి జిల్లాలోని ఎంపీడీవోల తోపాటు ఎంపీవోలు కార్యాలయ సిబ్బంది ఆపరేటర్ మొత్తాన్ని సిబ్బందిని సంగారెడ్డి జెడ్పి కార్యాలయానికి రప్పించారు. వీరికి జెడ్పి సమావేశం మందిరం తో పాటు కార్యాలయంలోని కొన్ని గదులను ప్రత్యేకంగా కేటాయించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్లలో ఎస్సీ ఎస్టీ బీసీ రిజర్వేషన్ ప్రక్రియ అనంతరం మిగిలిన సీట్లను ఓసీలకు డ్రా పద్ధతిలో నిర్ధారించనున్నారు. ఈ విషయమై సంగారెడ్డి జెడ్పి సీఈవో జానకి రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని వార్డు, గ్రామపంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసిలకు సంబంధించిన రిజర్వేషన్ల ప్రక్రియను రూపొందించడం జరుగుతుందని, దీనిని ప్రభుత్వానికి సమర్పిస్తామని తదుపరి ఆదేశాల ప్రకారం పనులు చేపడతామని ఆయన అన్నారు. సోమవారం చేపట్టిన ఈ ప్రక్రియ మంగళవారం పూర్తి కావచ్చునని ఆయన అన్నారు.

## యువకుడి అరెస్టు

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** కామాంధులు పేట్రేగిపోతున్నారు. విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి పశువుల్లా ప్రవర్తిస్తు న్నారు. మూగ జీవాల్నీ వదలట్లేదు కామాందులు. కామంతో కళ్లు మూసుకుపోయిన ఓ ప్రబుద్దుడు ఏకంగా ఓ గేదెతోనే లైంగిక కార్య కలాపాలు సాగించాడు. చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ కథనం ప్రకారం... మెదక్‌జిల్లా చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లికి చెందిన రైతు సిద్దిరాములు పశువులనుపెంచుతూ జీవనోపాధి పొందుతున్నాడు. సోమవారం ఉదయం రోజూమాదిరిగా పశువులను మేతకు తీసుకెళ్లి రాత్రి పాకలో కట్టేసి ఉంచాడు. అర్ధరాత్రి పశువులు అరవడంతో వెళ్లి చూడగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రోహిత్ పశువుపై లైంగిక దాడికి పాల్పడుతుండగా గమనించి అతడ్ని పట్టుకొని పోలీసులకు సమాచారం అందించాడు. రోహిత్ స్థానికంగా ఉన్న పరిశ్రమలో కూలిపనులు చేస్తు న్నాడు. పరిశ్రమ కూలీలు గంజాయి, మత్తు పదార్థాలకు బానిసయ్యా రని స్థానికులు తెలిపారు. రైతు సిద్ది రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

## కేతకి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ

**-హాజరైన పురప్రముఖులు, ఎస్ఐ**



కేతకి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఆరంభిస్తున్న అర్చకులు

**ఝరాసంగం, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన ఝరాసంగంలో కేతకి సంగమేశ్వరుడి ఆలయంలో సోమవారం శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయ అర్చకులు అంకురార్పణ చేశారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారికి ప్రాతఃకాలమున అభిషేకం, అలంకారము, నిత్యం ఉదయం 9.30 గంటల నుంచి భక్తులచే విఘ్నేశ్వరపూజ, చతుష్టి సమేత ఆవరణార్చనలు, లలితాహోమం పూజాకార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందచేస్తారని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. సోమవారం ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారిని శ్రీమంగళగౌరిదేవిగా అలంకరించి ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకలకు ఆలయ ఈఓ శివరుద్రప్ప, ఆలయకమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌పాటిల్, ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్, శ్రీకాంత్‌రెడ్డి తదితర ప్రముఖులు హాజరై అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

**నేటి నుంచి అమ్మవారి అలంకరణ...**
23న శ్రీగాయత్రీదేవిగా, 24న శ్రీఅన్నపూర్ణాదేవిగా, 25న శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా, 26న శ్రీమహాలక్ష్మీదేవిగా, 27న శ్రీకాత్యాయనీదేవిగా, 28న శ్రీచాముండేశ్వరీదేవిగా, 29న శ్రీమహాసరస్వతీదేవిగా, 30న శ్రీ దుర్గాదేవిగా, అక్టోబరు 1న శ్రీమహిషాసురమర్దినీదేవిగా, 2న శ్రీరాజరాజేశ్వరీదేవిగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

## మేఘనాయక్‌తండాలో తుల్జాభవానీమాత విగ్రహప్రతిష్ఠ

**-పాల్గొని పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**



తుల్జాభవానీమాత ప్రతిష్ఠాపన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మేఘనాయక్ తండా (ఇరాక్‌పల్లి)లో సోమవారం దేవిదాస్ మహారాజ్ ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన ఆలయంలో శ్రీ తుల్జా భవానీమాత విగ్రహ ప్రతిష్ఠాపన పూజాకార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విగ్రహప్రతిష్ఠాపనకు మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంగ్రామ్‌మహారాజ, మాజీ జడ్పిటిసి సభ్యులు లక్ష్మీబాయి, రవీందర్ నాయక్, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు పండరి, మాజీ మండల కో-ఆప్షన్ సభ్యులు సద్దాం, మాజీసర్పంచ్ శివరాంనాయక్, సంజీవ్‌కుమార్, నాగిరెడ్డి, వెంకట్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లపోచమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం



శరన్నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ చేస్తున్న దృశ్యం

**మనూర్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని బోరంచగ్రామంలో కొలువున్న శ్రీనల్లపోచమ్మ ఆలయంలో సోమవారం దేవీశరన్నవరాత్రి ఉత్సవాలకు వేదమంత్రాలు వల్లిస్తూ శ్రీకారంచుట్టారు. ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటుచేసుకున్న అమ్మవారి విగ్రహానికి అర్చకులు శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి వేదమంత్రాలు వల్లిస్తూ ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ మల్లయ్య, ఆలయ అర్చకులు సిద్దుస్వామి, నాగయ్యస్వామి, ప్రవీణ్‌స్వామి, శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శేఖర్, భక్తులు పాల్గొన్నారు.

## సెలవుల్లో పిల్లలపై జాగ్రతలు అవసరం

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:**
విద్యార్థులకు దసరాపండగ సెలవులు ప్రారంభమయినందున తల్లిదండ్రులు పిల్లల కదలికలపై నిఘా ఉంచాలని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. సెలవులు ఉన్నందున చిన్నారులు కులాసాగా మైమరిచి ఆటలు ఆడుకోవడం, అటవీప్రాంతాలకు, చెరువులవద్దకు వెళ్లడం లాంటివి చేస్తూ ఉంటారని గుర్తుచేశారు. చిన్నారులు ప్రమాదాలకు ఆస్కారం ఉన్న చెరువులు, కుంటల వద్దకు వెళ్లకుండా, చెట్లు ఎక్కకుండా, విద్యుత్‌స్తంభాల వద్ద ఆడుకోకుండా జాగ్రతలు తీసుకోవాల్సిన అవసరం తల్లిదండ్రులపై ఉందని ఎస్ఐ రామకృష్ణ గుర్తుచేశారు.

## రోడ్డు లేక తీవ్ర అవస్థలు

**నిజాంపేట్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:**
నిజాంపేట మండలం శక్కూర్ గ్రామంలో రోడ్డు సరిగా లేకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయరహదారికి ఒక కిలోమీటరు దూరంలో ఉన్న ఈమట్టిరోడ్డుపై గుంతలు ఏర్పడటంతో రాకపోకలు కష్టంగామారాయి. నిత్యావసరాలకు, గర్భిణీలను ఆసుపత్రికి తీసుకెళ్లడానికి కూడా చాలా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మించాలని వారు కోరుతున్నారు.

## కళాశాలలో ఉత్తీర్ణత శాతం పెంచాలి

**-జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారిణి మాధవి**



రికార్డులు పరిశీలిస్తున్న ఇంటర్ విద్యాశాఖ అధికారిణి మాధవి

**రామాయంపేట, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:**
రామాయంపేట ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో ఉత్తీర్ణతాశాతం పెరిగేందుకు తగుచర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారిణి మాధవి సూచించారు సోమవారం ప్రభుత్వ జూనియర్‌కళాశాలను ఆమె తనిఖీచేసి, పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కళాశాలకు విద్యార్థులు రెగ్యులర్‌గా వచ్చేవిధంగా చూడాలన్నారు. సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు అయ్యేనా?

**-ముందే ఉత్సవాలు చేసిన నాయకులు?**
**-పేపర్లలో ఫోజుల కోసమేనా?**




గుమ్మడిదల ఆరోగ్యకేంద్రం

**గుమ్మడిదల, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో ఆరునెలల క్రితం మేము మంత్రిని కష్టపడి అడిగాం, ఆయన ఇచ్చేసారు. ఎలాటి ఇబ్బందిలేకుండా త్వరలో ఏర్పాటు ఔతుంది అని గొప్పలకు చెప్పుకున్నారు. జిల్లా అధికారి ఏదో తూతూ మంత్రంగా వచ్చి స్థల పరిశీలనచేసి వెళ్లారు. త్వరలో ఏర్పాటుకాబోతోంది అంటూ నానా హంగామాచేసి పేపర్లలో ఫోటోలకు ఫోజులు ఇచ్చి మేమే చేశాము అని గొప్పలు చెప్పుకున్న నాయకులు, మానాయకులే చేశారంటూ ఇరుపార్టీలపై దుమ్మెత్తిపోసుకున్న కార్యకర్తలు, నాయకులు ఆరునెలలు కావస్తున్నా ఎక్కడవేసిన గొంగడి అక్కడే ఉంది. మంత్రిని కలిసాము పని అయిపోయింది అని మండలంలోకి వచ్చి నానా హంగామా చేసిన నాయకులు ఏమయ్యారు? వారికి కనబడడం లేదా? ఫోటోలకే పరిమితమా? రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నా స్థానిక నాయకులకు నిద్ర ఎలాపడుతుంది? హంగామా సంబరాలు చేసిన రోజులు గుర్తులేవా? అంటూ స్థానికులు నాయకులపై దుమ్మెత్తి పోస్తున్నారు. ఇకనైనా ప్రజలను మభ్యపెట్టకుండా చేసేపనిలో ప్రజల నమ్మకం ఉండేలా చేయాలని కోరుతున్నారు. ప్రధాన రహదారిపై ఎన్నో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రమాదం జరిగిన ప్రాంతం నుండి క్షతగాత్రులను దూర ప్రాంతంలో ఉన్న వైద్య కేంద్రానికి తీసుకొని వెళ్ళేలోపే మృత్యువాత పడుతున్న సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా స్థానిక నాయకులు అధికారులు పట్టించుకొని ట్రామా సెంటర్‌ను ఏర్పాటు చేసేవిధంగా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## గునుగ పువ్వుకు భలే డిమాండ్



గునుగ పువ్వను ఆటోల తరలిస్తున్న దృశ్యం

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:**
తెలంగాణకు సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మలకు అత్యవసరమైన గునుగ పువ్వుకు భలే డిమాండ్ ఏర్పడింది. దసరా పర్వదినాల్లో గ్రామాల్లోని ప్రతి హిందువుల ఇళ్ల ముందు రంగురంగుపూలతో బతుకమ్మలను పేర్చుకుని పండగను చేసుకోవడం ఆనవాయితీగావస్తోంది. బతుకమ్మ తయారీలో ఎన్ని పువ్వులు వినియోగించినా గునుగ పువ్వ లేకుండా బతుకమ్మకు అందమే రాదని ప్రత్యేకంగా చెప్పాల్సినపనిలేదు. మండలపరిధిలో గునుగపువ్వ అధికంగా ఉండటంతో పరిసర మండలాలైన టేక్మాల్, పాపన్నపేట, రేగోడ్, నారాయణఖేడ్ తదితర మండలాలకు వెందినవారు వాహనాల్లో చేరుకుని గునుగ పువ్వను తీసుకుపోతున్నారు.

## పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

**-నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**పెద్దశంకరంపేట, సెప్టెంబరు 22. ప్రభాతవార్త:**
బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పార్టీలకతీతంగా నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించామని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలో మాజీ ఎంపిపి జగన్ శ్రీనివాస్‌నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పార్టీలకు అతీతంగా సంక్షేమపథకాలను అందించామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి జంగం శ్రీనివాస్, రమేష్, దత్తు, మాణిక్‌రెడ్డి, సుభాష్, యాకుబ్, శంకర్‌గౌడ్, అశోక్, అంజయ్య, గోపాల్, యాదుల్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 24న ఆర్ఎస్ఎస్ ఆవిర్భావ ఉత్సవాలు

**నర్సాపూర్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:**
ఈనెల 24న నర్సాపూర్ పట్టణంలోని సాయికృష్ణ గార్డెన్‌లో ఆర్ఎస్ఎస్ ఆవిర్భావ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహకులు వనముల ఓంకార్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్‌సంఘ ఆవిర్భవించి 100సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈశతాబ్ది ఉత్సవాల్లోభాగంగా ఆవిర్భావ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈశతాబ్ది ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా వివిఎన్ఎస్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ సెయింట్ డాన్‌బాస్కో స్కూల్ వి.నర్సి రెడ్డి హాజరవుతుండగా ముఖ్యవక్తగా తెలంగాణప్రాంత సద్భావన సంయోజక్ నల్లచక్రవర్తుల రామకృష్ణ, హాజరవుతున్నట్లు తెలిపారు.

## సిసి రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



సిసి రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్

**అమీన్‌పూర్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:**
అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్‌గూడ సిద్ధార్థ ఎన్‌క్లేవ్ కాలనీలో మాజీ ఎంపిపి దేవానందం 5లక్షల రూపాయల సొంతనిధులతో నిర్మించతలపెట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పటేల్‌గూడ గ్రామపరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అభివృద్ధికి ప్రతీకగా పటేల్‌గూడను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపిపి దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్‌రెడ్డి, మాజీసర్పంచ్ నితీశ్‌శ్రీకాంత్, కాలనీ అసోసియేషన్ సభ్యులు హాజరయ్యారు.

## కలశయాత్రలో మాజీ కౌన్సిలర్

**-దుర్గామాతకు ప్రత్యేక పూజలు**



కలశయాత్రలో పాల్గొన్న మాజీ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి

**జిన్నారం, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:**
జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపాలిటీపరిధిలో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఉత్తరాదిరాష్ట్రానికి చెందిన ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే కలశయాత్రను మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఉత్తరాదికిచెందిన మహిళలు కలశాలను తలపై ధరించి మున్సిపల్ వీధులలో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్థానిక దుర్గామాత ఆలయంలో అమ్మవారిని పవిత్రజలాలతో అభిషేకం చేశారు. ఈసందర్భంగా మహిళలతో కలిసి దుర్గామాత ఆలయ కమిటీ చైర్మన్, మాజీ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఉత్తరాది ప్రజల ఆచార సంప్రదాయాలను ప్రతి ఏటా కొనసాగిస్తూ సంపూర్ణ సహాయ సహకారాలను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. శక్తిస్వరూపిణి దుర్గాదేవి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షి ంచారు. కలశయాత్రలో పాల్గొ న్న మహిళలకు శరన్నవరాత్రుల శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మాజీ వైస్‌చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి, మాజీకౌన్సిలర్ గోపా లమ్మ, దుర్గామాత ఆలయకమిటీ సభ్యులు దీననాథ్, రాజారామ్, శ్రీమన్నా రాయణ, జెజె.సింగ్, విజయ్, కార్మికనాయకులు లఖన్, ఉద్యానంద్, తివారి, హరేరామ్‌యాదవ్, మా అంబి మహిళాసేవాసమితి సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# రామాయంపేటలో బతుకమ్మకు రాళ్ల దారి

**-చీకట్లోనే నిమజ్జనం... కంపు కొడుతున్న మల్లె చెరువు... ఇబ్బందులు పడుతున్న మహిళలు...**
**పట్టించుకోని మున్సిపల్ శాఖాధికారులు...**
**మూడేళ్లుగా మల్లె చెరువుపై కంకరవేసి వదిలేసిన వైనం...**



బతుకమ్మల నిమజ్జనానికి రాళ్ల దారి గుండా వెళ్లాల్సిందే

**రామాయంపేట, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:**
రాష్ట్రప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న బతుకమ్మ ఉత్సవాల్లో ఇక్కడి మహిళలు మాత్రం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కారణం- స్థానిక మున్సిపల్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం, అశ్రద్ధ అని చెప్పవచ్చు. పవిత్రమైన బతుకమ్మ పండుగ వేళ మహిళలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. రామాయంపేట పట్టణంలోని మల్లెచెరువు కట్టపై బతుకమ్మను నిమజ్జనం చేయడానికి వెళ్తున్న మహిళలకు నరకం కనిపిస్తోంది. చెరువు కట్టపై మూడేళ్లుగా కంకర వేసి వదిలేయడం, చెరువు కట్టపై లైటింగ్ లేకపోవడం, బతుకమ్మ ఘాట్ల వద్ద చెత్తాచెదారం, మురుగు కంపుతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ అధికారుల తీవ్ర నిర్లక్ష్యంపై మహిళలు మండిపడుతున్నారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న దేవేందర్ పనితీరుపై ఎన్నిసార్లు ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ఆగ్రహం వ్యక్తం చేసినా, అధికారుల్లో మాత్రం చలనంరావడంలేదు. బతుకమ్మ నిమజ్జనానికి వెళ్లే రహదారి కంకర తేలి, చెత్తాచెదారంతో కంపు కొడుతున్నా, పట్టించుకునే నాథులు కరువయ్యారు. మల్లెచెరువు కట్టపై అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వం మూడేళ్ల క్రితం వేసిన కంకర అలాగే మిగిలిపోయింది. కట్టపై నడవడానికి మహిళలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలికి రాళ్లు తగిలి గాయాలపాలవుతున్నారు. ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మ కావడంతో పెద్ద సంఖ్యలో మహిళలు కంకర కట్టపై కట్టపై నుండి వెళ్తూ ... చెరువులో నుండి వచ్చే దుర్గంధానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చెరువులో చెత్తాచెదారం పడేయడంతో విపరీతమైన దుర్వాసన వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. సద్దులు, ఫలహారాలు తినడానికి సరైన వసతులు లేకపోవడం, దుర్వాసన వెదజల్లడంతో తీవ్ర అసౌకర్యానికి ప్రజలు గురవుతున్నారు.

**అంధకారంలో బతుకమ్మ ఘాట్లు...**
మల్లెచెరువుకట్టపై ఎక్కడా వీధిలైట్లు లేకపోవడంతో మహిళలు చీకట్లో నడవాల్సి వస్తోంది. దీంతో భద్రతాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మల్లెచెరువు పూర్తిగానిండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని మహిళలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. బతుకమ్మ ఘాట్ల చుట్టూ పొదలు పెరిగి విషసర్పాలు, ఇతర కీటకాలు వచ్చే ప్రమాదం పొంచి ఉందని, వెంటనే వాటిని శుభ్రపరచాలని కోరుతున్నారు. ఈసమస్యలపై మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ, పట్టించుకోవడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, మల్లెచెరువు కట్టపై కంకరను తొలగించి, లైటింగ్‌తో పాటు బతుకమ్మఘాట్లను శుభ్రంచేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని మహిళలు హెచ్చరించారు.

## రైతులకు నష్ట పరిహారం అందజేత

**గుమ్మడిదల, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి వార్డుపరిధిలో పారిశ్రామికవాడలో రసాయన పరిశ్రమలవ్యర్థాలతో పంటలు సాగు చేయలేక ఉపాధి కోల్పోతున్న రైతులకు రైతు కాలుష్య నివారణ కమిటీ పంట నష్టపరిహారం ఆదివారం అందజేశారు. బొంతపల్లిలో రైతు కాలుష్య నివారణ కమిటీ అధ్యక్షుడు కావలిరాజు, సభ్యులు సుంకరిశంకర్ ముదిరాజ్, ముద్దంగుల గోపాల్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బొంతపల్లి, వీర న్నగూడెం గ్రామానికిచెందిన రైతులకు చెక్కులు అందజేశారు. వీరభద్ర స్వామి ఆలయకమిటీ మాజీచైర్మన్లు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, సురభినాగేం దర్‌గౌడ్, సద్ది విజయభాస్కర్‌రెడ్డి, నాయకుల సమక్షంలో చెక్కులు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పారిశ్రామికవాడలో వివిధ రసాయన పరిశ్రమలతో పంటపొలాలు వ్యవసాయం పూర్తిగా దెబ్బతింటుందని రైతులకు చేదోడువాదోడుగా ఆర్థికసహాయం ఉంటుం దని అన్నారు. పూర్తిగా వ్యవసాయానికి పనికిరాకుండాపోయిన రైతులకు ఎకరానికి రూ.12 వేలు, బి గ్రేడ్ రైతులకు రూ.6వేలు, సిగ్రేడ్ రైతులకు రూ.2వేల విలువైన చెక్కులు అందజేశారు. గతేడాది 297మంది రైతు లకు రూ.40లక్షల పరిహారం చెక్కులు అందజేసినట్లు కాలుష్య నివారణ కమిటీ అధ్యక్షుడు రాజుతెలిపారు. కార్యక్రమంలో నాయకులు హుస్సేన్, చక్రపాణి, రాంరెడ్డి, సంజీవరెడ్డి, కావలి శంకరాయాదవ్, కుమార్‌గౌడ్, గటాటిరాజు, దేశబోయిన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ ర్యాంకులు సాధించిన మైనార్టీ గురుకుల విద్యార్థినులు

**జహీరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని బూచినెల్లి అల్గోల్ గ్రామాల్లోని తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల కళాశాలలో ఇటీవల నిర్వహించిన నీట్ (ఎంబిబిఎస్ ఎంట్రెన్స్ పరీక్షల్లో) పరీక్షల్లో 6గురు విద్యార్థినులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రుబినాబేగం తెలిపారు. కళాశాలకుచెందిన హఫ్సా ఫాతిమా వరంగల్ మెడికల్ కళాశాలకు, షేక్ సమీనా మదర్ కరీంనగర్ మెడికల్ కళాశాలకు, గల్లి అనూష మహబూబాబాద్ మెడికల్ కళాశాలకు, తన్సీ కమర్ మంచిర్యాల మెడికల్ కళాశాలకు, గగుప్త షనిం మెదక్ మెడికల్ కళాశాలకు, ప్రియా ఏంజిల్ వికారాబాద్ మెడికల్ కళాశాలకు ఎంపికయ్యారన్నారు. ఎంబిబిఎస్‌లో విద్యను అందుకునేందుకు అర్హత సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

## జిల్లాలో డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి

**-జిల్లాలోని గ్రంథాలయాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా**
**-జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి**




ప్రగతి పథంలో దూసుకుపోతున్న నర్సాపూర్ గ్రంథాలయం దృశ్యం

**నర్సాపూర్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:**
జిల్లాలోని గ్రంథాలయాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని పేర్కొంటూ జిల్లాలో డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటుకు కృషిచేస్తానని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి మాట్లాడుతూ నర్సాపూర్‌లోని గ్రంథాలయంలో అన్నివసతులు ఏర్పాటుచేశామని నూతనంగా ప్రహరీగోడ, మరుగుదొడ్లు నిర్మించినట్లు తెలిపారు. అంతేగాక జిల్లాలో నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేటలలో డిజిటల్ గ్రంథాలయాలను ఏర్పాటుచేసి ఎఐ టెక్నాలజీని పాఠకులకు అందుబాటులోకి తెస్తానని ఆమె అన్నారు. నర్సాపూర్‌లో నూతనంగా విశాలమైన గ్రంథాలయాన్ని నిర్మించడంతోపాటు అన్ని వసతులను సిఎస్ఆర్ నిధులు వెచ్చించి సమకూరుస్తున్నట్లు తెలిపారు. పాఠకుల అవస్థలను గుర్తించి 80కుర్చీలు, పుస్తకాలను భద్రపరుచుకునేందుకు 20ర్యాకులు, 20బల్లలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈవిశాలమైన భవనంలో అన్ని వసతులు సమకూరడంతో 1469మందిసభ్యులు ఉన్నారని, వీరికోసం 1324 పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. అంతేగాక విద్యార్థుల పోటీపరీక్షల కోసం పుస్తకాలనుకూడా ఉంచామన్నారు. సిఎస్ఆర్ నిధులతో ఈ గ్రంథాలయ భవనం మొదటి అంతస్తులో పాఠకుల కోసం అన్ని సౌకర్యాలు కల్పించగా మరోగదిలో లైబ్రేరియన్ కార్యాలయం ఏర్పాటుచేయగా, గ్రౌండ్ ఫ్లోర్లో మరుగుదొడ్లను నిర్మించామన్నారు. అదే విధంగా దివ్యాంగులు, విశ్రాంత ఉద్యోగులు మొదటి అంతస్తుకు వెళ్లలేకపోతున్నందున వారికోసం గ్రౌండ్‌ఫ్లోర్‌లో రీడింగ్‌రూమ్, వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు ఏర్పాటుచేశామన్నారు. కాగా, నూతనంగా గ్రంథాలయ భవనానికి ప్రహరీగోడ నిర్మించగా గేటు ఏర్పాటుచేశామని తెలిపారు. ఈమేరకు గతంలో ఎప్పుడు రానటువంటి పాఠకులు నూతన గ్రంథాలయానికి అధికసంఖ్యలో వస్తున్నారని తెలిపారు. జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్పర్సన్‌గా సుహాసినిరెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత అన్నివసతులు కల్పించగా నర్సాపూర్ గ్రంథాలయం ప్రగతి పథంలో దూసుకుపోతుంది.

**గురుకుల పాఠశాలకు పుస్తకాలు అందజేత...**
గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్న జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి ఆధ్వర్యంలో నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకులపాఠశాల, కళాశాలలో 119పుస్తకాలను అందజేశారు. ఈగ్రంథాలయాలను విద్యార్థులతోపాటు ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని చైర్‌పర్సన్ చెరువుల సుహాసినిరెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు.

## ఏడుపాయలలో శరన్నవరాత్రి ఉత్సవాలు



ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు

**పాపన్నపేట, సెప్టెంబరు 22. ప్రభాతవార్త:**
పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గ భవానీమాత సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం అత్యంతవైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, మాజీ ఎంపిపి చందనరెడ్డి దంపతులతో కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. వచ్చేనెల 2 వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఏడుపాయలలోని గోకుల్ షెడ్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ముందుగా అమ్మవారి ఉత్సవవిగ్రహాన్ని రాజగోపురం నుండి గోకుల్‌షెడ్ వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి గోకుల్‌షెడ్‌లో ప్రతిష్ఠించి సనాతనశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు గోవిందునాయక్. మాజీ ఎంపిపి చందనప్రశాంత్‌రెడ్డి, శ్రీకాంత్ అప్ప, మోహన్‌రెడ్డి, మల్లప్ప, పార్శ నర్సింలు, ఆకుల శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు, శ్రీధర్, మోహన్, ఉత్సవవిగ్రహ దాత ఇంద్రసేనారెడ్డి దంపతులతోపాటు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బాలాత్రిపుర సుందరీదేవిగా వనదుర్గాదేవి దర్శనమిచ్చింది. పలుప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని తరించిపోయారు.

**నేడు గాయిత్రి దేవిగా...**
శరన్నవరాత్రి ఉత్సవాల్లోభాగంగా రెండవరోజు అయిన మంగళవారం గాయత్రీదేవి రూపంలో గులాబీరంగులో దర్శనమివ్వనున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ వెల్లడించారు.